తెల్లవారు జామున వర్షబీభత్సం

ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు, అధికారులు

కాలనీలు, బస్తీలను ముంచెత్తిన వరదనీరు

కూలిన చెట్టు.. కుంగిన మ్యాన్‌హోళ్లు

ముషీరాబాద్/అంబర్‌పేట, ఆగస్టు 20: తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్తీలు, కాలనీలు, నాలా పరీవాహక ప్రాంతాల్లో వరదనీరు చేరింది. పలు ప్రాంతాల్లో చెట్లు కూలి, మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. మంగళవారం తెల్లవారు నుంచి భారీ వర్షం కురవడంతో నాలాలు పొంగి ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. పలు బస్తీలు, కాలనీలతోపాటు నాలా పరీవాహక ప్రాంతాల్లోని వందలాది ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో నిత్యావసర సరుకులు నీటి మునిగిపోయాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్ బాపూజీనగర్, జాంబవీనగర్, గణేశ్‌నగర్, సాయిచరణ్ కాలనీల్లో భారీగా వరద నీరు చేరి ఇళ్లల్లోకి చేరడంతో నిత్యావసర వస్తువులు , సరుకులు నీట మునిగాయి. గణేశ్‌నగర్, బాపూజీనగర్, జాంబవినగర్, పద్మకాలనీ, బాప్టిస్టు చర్చి ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరి జనం ఇక్కట్లు పడ్డారు. అదేవిధంగా రాంనగర్ డివిజన్ సూర్యానగర్, శాస్త్రీనగర్, కవాడిగూడ డివిజన్ కోదండరెడ్డి నగర్‌లలో వరద నీరు ఇళ్లను ముంచెత్తింది.

– వరద ముంపు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, పారిశుధ్య విభాగాల అధికారులు పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహినుద్దీన్ అధికారులు, సిబ్బందితో కలిసిముంపు ప్రాంతాలైన గణేశ్‌నగర్, సాయిచరణ్ కాలనీ పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వరద బాధితులు తమ ఇళ్లల్లో నిత్యావసర వస్తువులు నీట మునిగాయని ఫిర్యాదు చేశారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో ..

అలాగే నల్లకుంటలోని ఓల్డ్ రామాలయం వీధిలో మ్యాన్‌హోల్ కుంగిపోయి.. ఓల్డ్ రామాలయంలోకి వరదనీరు చేరింది. ఛే నంబర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకి కూడా వరదనీరు చేరింది. తులసీరాంనగర్ లంక బస్తీలో ఇండ్లలోకి వరద వచ్చింది. అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తా వరదతో చెరువులా మారింది. ఛే నెంబర్ చౌరస్తా మొత్తం జలమయమైంది. రోడ్లు ఛిద్రమయ్యాయి. అంబర్‌పేట సీపీఎల్ రోడ్డు మొత్తం వరదతో నిండిపోయింది. బాగ్‌అంబర్‌పేట డివిజన్ రామకృష్ణానగర్‌లో ఓ చెట్టు కూలింది. ప్రమాదవశాత్తు ఎవరికి ఏమీ కాలేదు. ఉదయాన్నే లేచి ఉద్యోగాలు, విధులకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు.

ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు...

నల్లకుంట డివిజన్‌లోని ఓల్డ్ రామాలయం వీధిలో ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్.. డివిజన్ కార్పొరేటర్ వై.అమృత, జీహెచ్ఎంసీ డీసీ మారుతీ దివాకర్, డీఈ ప్రవీణ్, ఏఎంఓహెచ్ డా.హేమలత తదితరులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నల్లకుంట సీనియర్ సిటిజన్స్ ఎమ్మెల్యేకు అక్కడి వరద బాధలను వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బాక్స్ డ్రెయిన్ ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. కుంగిన మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్ గౌడ్ కూడా ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. మాన్‌సూన్ బృందాలను రప్పించి వరదనీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే వరద సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ రామకృష్ణానగర్‌లో కూలిన చెట్టును హార్టికల్చర్ అధికారులు తొలగించారు. గాయత్రి టవర్స్ వద్ద నిలిచిపోయిన వర దను డీసీ మారుతీ దివాకర్ ఆదేశాలతో మాన్‌సూన్ సిబ్బంది తొలగింపజేశారు.

గాంధీనగర్‌లో డివిజన్‌లో..

చిక్కడపల్లి : మంగళవారం తెల్లవారుజామున కుండపోత వర్షానికి గాంధీనగర్‌లో డివిజన్‌లోని లోతట్టు ప్రాం తాలు జలమయమయ్యాయి. డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ సూచన మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. బాగ్‌లింగంపల్లిలో పలు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందు భారీ గా నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లో భారీగా వరదనీరు చేరాయి.

నల్లకుంట ఓల్డ్ రామాలయం రోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ వై.అమృత

అంబర్‌పేటలో మాన్‌సూన్ సిబ్బందితో కలిసి వరదనీటిని తొలగిస్తున్న కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్

నల్లకుంట ఓల్డ్ రామాలయంలోకి చేరిన వరదనీరు

ఛే నంబర్‌లోని వేంకటేశ్వరస్వామి టెంపుల్‌లో చేరిన వరదనీరు

బాగ్‌అంబర్‌పేట డివిజన్ గాయత్రి టవర్స్ వద్ద మడుగులా వరదనీరు

గణేశ్ నగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు

రాంనగర్‌లో..

టోలీచౌకి, నానల్‌నగర్, మెహిదీపట్నం ప్రధాన రోడ్లలో వర్షం నీరు ఉండకుండా మ్యాన్‌హోల్స్‌పై కప్పులు తొలగించి నీరు పోయేలా చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పీజీ కోర్సుల పరీక్షా ఫీజు గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం , ఎంకాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుంతో 27 లోగా చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును 27 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అబిడ్స్, ఆగస్టు 20: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం..ఈ నెల 19న జీపీఓ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించిన కానిస్టేబుల్ రాఘవేంద్ర వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి దవాఖానకు తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతని జేబులో లభించిన ఆధార్ కార్డులో మహేందర్ బబ్లూ రెడ్డి మధ్య ప్రదేశ్ భోపాల్ ప్రాంతానికి చెందినది ఉంది.

ఆకట్టుకున్న రామాంజనేయ యుద్ధం పద్యనాటకం

రవీంద్రభారతి, ఆగస్టు 20: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీశారద కళానికేతన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని త్యాగరాయ గానసభ సహకారంతో రామాంజనేయ యుద్ధం పద్య నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఓలేటి పార్వతీశం, విజయభాస్కర్, జనార్ధనమూర్తిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి రామాంజనేయ యుద్ధం పద్యనాటకాన్ని ప్రారంభించారు. ఈ పద్యనాటకంలో తట్రాజు సత్యనారాయణ కృష్ణుడిగా, మామిడి సంజీవరావు దుర్యోధనుడిగా, లింగమయ్య, నర్సింగ్‌రావు, సంధ్యాల సుబ్బలక్ష్మి, తెనాలి పంతులు, రామ్మోహన్, బి.రాములు ఈ నాటకంలో పాల్గొన్నారు. రామాంజనేయ యుద్ధానికి ఫేమ్ రాజ బాబు దర్శకత్వం, సంగీతాన్ని సమకూర్చారు. అనంతరం పలువురి వక్తలను శ్రీశారదా కళానికేతన్ అవార్డులతో సత్కరించారు. ఈకార్యక్రమంలో అనిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయ యుద్ధంలో నటిస్తున్న కళాకారులు

'నాలెడ్జ్ జంక్షన్ ఆఫ్ ఎలిమెంట్స్' పుస్తకావిష్కరణ

తెలంగాణ స్త్రీ సేవా సంస్థ, కవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అశోక్‌నగర్‌లోని అశోక్‌నగర్ సాంస్కృతిక సంస్థ హాల్లో చూపూరి శంకర్ రావు రచించిన 'నాలెడ్జ్ జంక్షన్ ఆఫ్ ఎలిమెంట్స్' పార్ట్–2 పుస్తకాన్ని ఆవిష్కరించారు. కోవా డైరెక్టర్ డాక్టర్ మజర్ హుస్సేన్, తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ గురుజాడ శోభ మాట్లాడుతూ..అనారోగ్యం వస్తే ఎలా నివారించాలో పుస్తకంలో బాగా వివరించారని తెలిపారు. సంస్థ కార్యదర్శి డి.హేమలత, సంయుక్త కార్యదర్శి నీలం సంధ్య, సంధ్యశ్రీ, పద్మ, శంకర్ రావు, తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, ఆగస్టు 20

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. గాంధీభవన్‌లో టీపీసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిలు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు.
– అబిడ్స్, ఆగస్టు 20

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కాచిగూడ,ఆగస్టు 20: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాచిగూడ డివిజన్‌లోని శిథిలావస్థలో ఉన్న ఇండ్ల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని స్థానిక కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు డివిజన్‌లోని మౌలానాఆజాద్‌నగర్‌లో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. దశాబ్దకాలం నాటి ఇళ్లను కూల్చివేయాలని స్థానికులు ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, ఏఈ విశ్వతేజ, సంతోశ్, రవియాదవ్,ఓంప్రకాశ్, రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ ఉమ, పాల్గొన్న అధికారులు

ఆహ్వానం: ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని దాయాబాగ్ హనుమాన్ బాలాజీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 16 వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు – మెహిదీపట్నం ఆగస్టు 20

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి

చిక్కడపల్లి, ఆగస్టు 20 : మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని వెంటనే తీసుకురావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి తెలంగాణ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ డబోల్కర్ వర్ధంతి సందర్భంగా చర్చా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని రాష్ట్రం ప్రభుత్వం తీసుకురావాలన్నారు. సమితి ఆధ్వర్యంలో మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాలనే డిమాండ్‌తో సెప్టెంబర్‌లో అన్ని యూనివర్సిటీల్లో సైన్స్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, మహిళా సంఘాల నాయకులు ముల్లు లక్ష్మి, స్వరాజ్యలక్ష్మి, కుల నిర్మూలన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కలియుగ గురువు రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలు బర్కత్‌పుర లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్ర బృందావన సమితిలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆరాధనోత్సవాల్లో అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి బీపీ రాఘవేంద్రరావు, మేనేజర్ నర్సింహాచారి,గరిగంటి రమేశ్, దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ

డ్రైనేజీలో వ్యర్థాలు వేస్తే హోటల్‌కు తాళం వేస్తా

ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

మెహిదీపట్నం, ఆగస్టు 20: ప్రజలకు ఇబ్బందులు కల్గించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ హెచ్చరించారు. టోలీచౌకి చౌరస్తాలో ఉన్న హోటల్ నిర్వాహకుల కారణంగా డ్రైనేజీ వ్యవస్థ స్తంభించి ముంపు సమస్యలు ఏర్పడుతుండటంతో సోమవారం అర్ధరాత్రి తర్వాత మంగళవారం తెల్లవారుజామున రహమత్ హోటల్స్‌ను, పరిస ప్రాంతాలను ఎమ్మెల్యే సందర్శించారు. హోటల్ వద్ద డ్రైనేజీ శుభ్రం చేయించగా హోటల్‌లోని వ్యర్థాలు అధికశాతం బయట పడ్డాయి. వ్యర్థాలను చూడగానే ఆగ్రహానికిగురైన ఎమ్మెల్యే.. డ్రైనేజీలో వ్యర్థాలను ఎలా కలుపుతారంటూ మండిపడ్డారు. ఇప్పటి నుంచి హోటల్ వ్యర్థాలు డ్రైనేజీలో కలిపితే హోటల్‌కు తాళం వేస్తానని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం మంగళవారం ఉదయం జీహెచ్ఎంసీ కార్వాన్,జూబ్లీహిల్స్ సర్కిళ్ల ఈఈలు వెంకటేశయ్య,విజయ్‌కుమార్ , తదితర అధికారులతో వర్షం ప్రభావిత ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు,నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ. నసీరుద్దీన్‌తో కలిసి పర్యటించారు. నాలాల్లో పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని, బాక్స్‌టైన్ డ్రైన్‌లను శుభ్రం చేయించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

టోలీచౌకి చౌరస్తాలో హోటల్ వారిని హెచ్చరిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సుల్తాన్‌బజార్, ఆగస్టు 20: ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని గోషామహల్ టీటీఐ సిబ్బంది లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1–2ల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ హరీశ్ నేతృత్వంలో టీటీఐ సిబ్బంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, ఎన్ఎస్ఎస్ యూనిట్–1,2 ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ అరవింద్, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ మస్కిటో డే ర్యాలీ..

అంబర్‌పేట : వరల్డ్ మస్కిటో డేను పురస్కరించుకొని జీహెచ్ఎంసీ అర్బన్ మలేరియా స్కీమ్(ఎంటమాలజీ) ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట ఫీవర్ దవాఖాన నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీన్ని డీసీ మారుతీ దివాకర్, ఏఎంఓహెచ్ డా.హేమలత, ఎస్ఈ దుర్గాప్రసాద్, ఏఈ అంబికలు ప్రారంభించారు. ఫీవర్ చౌరస్తా నుంచి బర్కత్‌పుర అంజయ్య పార్కు వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఈఎఫ్ఏలు రాఘవేందర్, నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, కిషన్ పాల్గొన్నారు.

ఫీవర్ దవాఖాన నుంచి వరల్డ్ మస్కిటో ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్ మలేరియా స్కీమ్ సిబ్బంది

దోషులను కఠినంగా శిక్షించాలి

రవీంద్రభారతి, ఆగస్టు 20: దేవతలకు ప్రతిరూపమైన యువ పీజీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన చాలా దారుణమైన సంఘటన అని , ఈ ఘటన సభ్యసమాజం తలదించుకొనేలా ఉందని డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ.. స్త్రీని దేవతగా, కాళీమాతగా కొలిచే భారతదేశంలో ఈ సంఘటన నా మనస్సును కలిచివేసిందని, ఎంతో ఆవేదనకు గురిచేసిందని, నిందితులను కఠినంగా శిక్షించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్ననాటి నుంచే యుద్ధ విద్యలో తర్ఫీదు ఇప్పించాలన్నారు. పురుషులకు మహిళల పట్ల ప్రేమానురాగాలు పంచేటట్లుగా తయారుచేయాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఎల్‌బీ స్టేడియంలో కూలిన ప్రహరీ

నాలుగు వాహనాలు ధ్వంసం

సుల్తాన్‌బజార్,ఆగస్టు 20 : తెల్లవారుజాము నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షంతో నగరంలోని పలు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం భారీగా కురిసిన వర్షానికి బషీర్‌బాగ్ ఎల్‌బీ స్టేడియంలోని పాత సీసీఎస్ కార్యాలయానికి, స్కేటింగ్ కోర్టుకు ఆనుకొని ఉన్న ప్రహరీతోపాటు భారీ వృక్షం కూలింది. ఈ ఘటనలో అక్కడే పార్కు చేసిన ఓ పోలీస్ వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం కాగా మరో మూడు వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్ టీం రంగంలోకి దిగి ప్రహరీతో సహా నేలకొరిగిన వృక్షాన్ని, గోడ శిథిలాలను అక్కడ నుంచి తొలగించారు.

ఎల్‌బీ స్టేడియంలో కూలిన ప్రహరీ, ధ్వంసమైన పోలీస్ వాహనాలు

వేర్వేరు రైళ్లలో దొంగతనాలు

కాచిగూడ,ఆగస్టు 20: వేర్వేరు రైళ్లలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికుల బ్యాగుల్లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుల్లో నుంచి నగదు, ఆభరణాలు, కార్డులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, గిద్దలూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు భార్య కర్రె వెంకట విజయలక్ష్మికుమారి స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తూ.. బ్యాగు చూడగా అందులో ఉన్న 35 గ్రాముల బంగారు ఆభరణాలను కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

మహబూబ్‌నగర్ రైల్లో...

అంకెనపల్లి ప్రాంతానికి చెందిన అప్పారావు కుమారుడు అశోక్‌వర్ధన్ మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైల్లో కాచిగూడకు వస్తుండగా బ్యాగులో ఉన్న ల్యాప్‌ట్యాప్,రూ.1000,కార్డులను దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం వరంగల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

మరో సంఘటనలో....

ఏపీ, ఈస్ట్‌గోదావరి ప్రాంతానికి చెందిన గుప్తా కుమార్తె పద్మతా రత్నావళి(24)మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైల్లో కాచిగూడకు వస్తుండగా బ్యాగులో ఉన్న ఖరీదైన సెల్‌ఫోన్, రూ.2500ను దొంగిలించారు. మంగళవారం రత్నావళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం వరంగల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,ఆగస్టు 20: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) ఉప్పుగూడ–ఫలక్‌నామ రైల్వేస్టేషన్‌ల మధ్య కందికల్ గేట్ సమీపంలో మంగళవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతిని ఒంటిపై స్కైబ్లూ పూల చొక్కా, బుడిద రంగు ప్యాంట్ ధరించి,ఎత్తు 5.5 ఉన్నట్టు తెలిపారు.

మృతుని వివరాల కోసం ఫోన్: 8143807592లో సంప్రదించాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.